E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 30-05-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:147 || పేజీలు–6
www.ekaburu.com

'నైరుతి'లో వర్షం తక్కువే!

02

ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా

- ప్రజాప్రతినిధులు వారంలో ఒకరోజు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే
- సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారమేనా.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పరా?
- పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక

ఈ-కబురు, హైదరాబాద్:
ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. "మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, సీనియర్ నాయకులు వారంలో ఒకరోజు నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలవాలి. నాతో సహా ఎవరు ఎక్కడికి వెళ్లాలనేది పీసీసీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ క్యాడర్.. సోషల్ మీడియా వారియర్లుగా మారి పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఇప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు.

మిగతా 2లో

సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

03

- విధానసౌధలో సాయంత్రం 4 గంటలకు సీఎల్పీ భేటీ
- శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఖరారు
- సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించిన గవర్నర్
- మంత్రివర్గంలో చోటు కోసం ఎమ్మెల్యేల యత్నాలు
- ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో సిద్ధరామయ్య, డీకేఎస్ భేటీ
- కొత్త ప్రభుత్వ ఏర్పాటు, కేబినెట్ కూర్పుపై చర్చలు
- సోమవారం డీకేఎస్ ప్రమాణ స్వీకారం

కొనుగోళ్లలో మాదే రికార్డు

- ఏపీ 24, తమిళనాడు 12, మహారాష్ట్రలో 3 లక్షల టన్నులే సేకరణ
- రైతులకు ఈ నెల 28 నాటికి రూ.11,050 కోట్లు చెల్లించాం
- వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. సేకరణ టార్గెట్‌ను కేంద్రం ఏటా తగ్గిస్తోంది
- బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగే బదులు ఢిల్లీకి వెళ్లి టార్గెట్ పెంచాలి
- బీఆర్ఎస్ హయాంలో టార్గెట్‌లో ఎన్నడూ 50శాతం మించి కొనలేదు
- పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

02

పండిన ప్రతిగింజనూ ప్రభుత్వం కొనాలి

03

స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు

- కాలుష్యరహిత గోదావరి పుష్కర నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక
- ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీల గుర్తింపు
- మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఆదేశం

ఈ-కబురు,అమరావతి
కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' పేరిట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఆరు జిల్లాల పరిధిలో గుర్తించిన 262 పంచాయతీలను మురుగురహితంగా తీర్చిదిద్దడంతోపాటు గోదావరి నదిలో కాలుష్య కారక వ్యర్థాల విడుదలను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో

యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

- ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు ధర్మాసనం హితవు
- 'నీట్'లీకేజీ విద్యార్థులకు, వారి కుటుంబాలకు తీరని వేదన
- వాబుదారీతనం లేకపోతే సమస్య పరిష్కారం కాదు
- సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం

ఈ-కబురు,న్యూఢిల్లీ: మన యువతను ఎప్పుడూ నిరాశపర్చకూడదని సుప్రీంకోర్టు సూచించింది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)–యూజీలో అక్రమాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు ఈ వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన అసలు సమస్య పరిష్కారం కాదని వెల్లడించింది. నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు పదేపదే పునరావృతం కావడం వ్యవస్థాగత వైఫల్యమేనని స్పష్టం చేసింది.

02



గ్రీన్ ఎనర్జీ దిశగా ఏపీ

- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి
- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు

ఈ-కబురు,అమరావతి, మే 29 :-
రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ 3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈడ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ 3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మిగతా 3లో

రైతు డిస్కమ్.. ప్రభుత్వ కుట్ర

- రైతు డిస్కమ్ తో వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టే
- రైతులకు అన్యాయం చేస్తూ 1999 నాటి కాల్పుల ఘటనను ప్రభుత్వం కొని తెచ్చుకోవద్దు

03

ఇందిరమ్మ గృహాలే రిఫరెండం

- పట్టణాల్లో అవసరమైతే పదంతస్తుల భవంతులు
- జూన్ 1న మరో 2.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభం
- కేటీఆర్.. మీకు నేను విసిరిన సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా.. లేదా?
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

03

స్పెల్లింగ్‌బీ విజేతగా 14 ఏళ్ల ఇండో అమెరికన్ శ్రేయ్ పారిఖ్

ఈ-కబురు, వాషింగ్టన్: అమెరికాలో నిర్వహించిన స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి శ్రేయ్ పారిఖ్(14) విజయం సాధించాడు. కాలిఫోర్నియాలోని ఇండో-అమెరికన్ కుటుంబానికి చెందిన శ్రేయ్..

03

ఇందిరమ్మ గృహాలే రిఫరెండం

ఈకబురు,హైదరాబాద్: ఇందిరమ్మ గృహాలు రిఫరెండంగా వచ్చే శాసనసభ ఎన్నికలు ఉంటాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గృహనిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'పదేళ్లలో పట్టణాల్లో భారాస నిర్మించిన గృహాల కన్నా... కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ నిర్మిస్తుంది. హైదరాబాద్‌లో భారాస కంటే ఎక్కువ ఇళ్లు కడితేనే నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పా. కాంగ్రెస్ ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారా అని మీకు (కేటీఆర్‌కు) సవాల్ విసిరా. మీకు ఈ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా..లేదా? గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల విషయమై మాట్లాడే ధైర్యం లేకపోగా.. హైదరాబాద్‌లోని గృహాల అంశంపై సవాల్ చేస్తే స్వీకరించకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు దిల్లీలో భాజపా నేతల ముందు మోకరిల్లారు. కేసుల మాఫీ కోసం కాషాయ నేతల కాళ్లు పట్టుకున్నారు. ధరణి దందాలు, బినామీ బాగోతాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలు చేశారు. 2014కు ముందు మీ ఆర్థిక పరిస్థితి... పదేళ్లలో ఎంత దోచుకున్నారో అందరికీ తెలుసు. గ్రామాల్లో పదేళ్లలో కట్టిన ఇళ్ల కన్నా మూడు రెట్ల ఎక్కువ గృహాలు కాంగ్రెస్ రెండేళ్లలో కట్టింది'' అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన నమూనా డిజైన్లు పరిశీలించి మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా పది అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ''చిత్తశుద్ధితో రెండున్నరేళ్లలో గ్రామాల్లో 4.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభించాం. జూన్ 1న మరో 2.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభిస్తాం. హైదరాబాద్‌లో తొలివిడతలో లక్ష గృహాలు నిర్మించనున్నాం.

వాస్తు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వండి

దేశానికి ఆదర్శంగా అర్బన్ హౌసింగ్ నమూనాను తెస్తున్నాం. పట్టణాల్లో నివసించే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించాలి. రానున్న 40, 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలి. మౌలిక సదుపాయాలు కీలకం. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలి. వాస్తు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వండి. పార్కింగ్‌తో పాటు షాపులకు అవకాశం ఉండాలి. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో గృహాలు నిర్మించాలి. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది డిజైన్లు ఖరారు చేసి, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తాం'' అని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా

ఈకబురు, హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ''మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్పర్సన్లు, సీనియర్ నాయకులు వారంలో ఒకరోజు నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలవాలి. నాతో సహా ఎవరు ఎక్కడికి వెళ్లాలనేది పీసీసీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ క్యాడర్.. సోషల్ మీడియా వారియర్లుగా మారి పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఇప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం చేసుకోవడమే తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనీయడం లేదు. పార్టీ కోసం సోషల్ మీడియా వినియోగంపై ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాలి.

'సర్'పై సమన్వయంతో పనిచేయాలి..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(సర్)పై పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి. నేతలు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు పోలింగ్ బూత్ స్థాయిలో పనిచేస్తారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. నగర పరిధిలోని 15 నియోజకవర్గాలవారీగా 'సర్'పై సమావేశాలు పెట్టాలి. మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా భేటీలు నిర్వహించాలి. 'సర్'లో భాగంగా ఓట్ల తొలగింపుతో సామాన్యులు, పేదలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం. లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు. దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలకు పరిష్కారంపై అందరూ సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.

అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..

గతంలో డిజిటల్ విధానంలో ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం. అప్పుడు కీలకపాత్ర పోషించిన వారిని ఇప్పుడు 'సర్' కార్యక్రమంలో పనిచేసేలా పరిగణనలోకి తీసుకోవాలి. 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 'సర్' పర్యవేక్షణకు ఇన్‌ఛార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌ఛార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. ఈ విషయంలో పీసీసీ మాజీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. దాదాపుగా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశాం. పార్టీ తరఫున ఇప్పుడు వేల మంది సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. వలస పోయిన వారి ఓట్లు తొలగించకుండా వారంతా జాగ్రత్తలు తీసుకోవాలి'' అని సీఎం చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

'సర్' విషయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై మంత్రులు, ఇతర నేతలు తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా చెప్పారు. ఒక నాయకుడు మాట్లాడుతుండగా.. సీఎం కల్పించుకుని ముందు గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు?, పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకాలు ఇంకా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించినట్లు తెలిసింది.

యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

ఈకబురు,న్యూఢిల్లీ: మన యువతను ఎప్పుడూ నిరాశపర్చకూడదని సుప్రీంకోర్టు సూచించింది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)-యూజీలో అక్రమాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు ఈ వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన అసలు సమస్య పరిష్కారం కాదని వెల్లడించింది. నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు పదేపదే పునరావృతం కావడం వ్యవస్థాగత వైఫల్యమేనని స్పష్టం చేసింది.

పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) పరీక్షల విధానం గురించి సుప్రీంకోర్టు ప్రస్తావించింది. యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో పేపర్ లీక్ వంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని గుర్తుచేసింది. యూపీఎస్సీ నుంచి పాఠాలు నేర్చుకోవాలని ఎన్‌టీఏకు హితవు పలికింది.

నీట్ (యూజీ)లో అవకతవకల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దు చేసేలా లేదా ఆ సంస్థను పునర్వ్యవస్థీకరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ అభ్యర్థుల ఆందోళనల పరిష్కారం పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తోందని చెప్పారు.

ప్రవేశ పరీక్షలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. జూన్ 21న జరగనున్న నీట్-యూజీ రీటెస్ట్ కోసం కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. పరీక్షలో అక్రమాలు జరిగితే విద్యార్థులకే కాకుండా వారి కుటుంబాలకు కూడా అది చాలా బాధాకరమైన విషయం అవుతుందని పేర్కొంది. వారు చాలా భావోద్వేగానికి గురవుతారని తెలిపింది. బాధ్యత ఎవరి భుజస్కంధాలపై ఉందో తెలిసినప్పుడే జవాబుదారీతనం ప్రభావవంతంగా ఉంటుందని స్పష్టంచేసింది.

వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం: తుషార్ మెహతా

పరీక్షల్లో అక్రమాలు జరగకుండా ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందేనని తుషార్ మెహతా అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని, పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు.

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో ఎన్‌టీఏ పరీక్షల్లో పెన్ అండ్ పేపర్ విధానానికి బదులు కంప్యూటర్ బేస్ట్ టెస్ట్(సీబీటీ) విధానాన్ని అమలు చేయడంతో పాటు, సైబర్ భద్రతను పెంచుతున్నామని తెలిపారు.

ఐఐటీ తదితర సంస్థల నుంచి నిపుణులను భాగస్వాములను చేసి వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు తుషార్ మెహతా వివరించారు. చాలా సంస్థలు తాత్కాలికమైనవి కావడమే అసలు సమస్య అని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక సంస్థలో అత్యుత్తమంగా పనిచేసే అధికారిపైనే అందరూ ఆధారపడతారని పేర్కొంది. దేశమంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. సామర్థ్యం అనేది సంస్థకు ఉండాలని సూచించింది. అందుకే సంస్థను గొప్పగా పనిచేసేలా తీర్చిదిద్దాలని ఉద్ఘాటించింది.

సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయండి

తాము మే 25వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుకు అనుగుణంగా ఎన్‌టీఏ డైరెక్టర్ (లీగల్) ఒక అఫిడవిట్ దాఖలు చేశారని ధర్మాసనం పేర్కొంది. అఫిడవిట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలియజేసింది. ఎన్‌టీఏలో సంస్కరణల కోసం 'ఇస్రో' మాజీ ఛైర్మన్ డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చేసిన సిఫార్సుల అమలు, భవిష్యత్ కార్యాచరణను సూచిస్తూ కె.రాధాకృష్ణన్ కూడా ఒక అఫిడవిట్ దాఖలు చేశారని ధర్మాసనం వెల్లడించింది.

ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహణ, ముగింపు ప్రక్రియను ఏవిధంగా పూర్తిచేస్తారో తెలియజేస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024 లేదా 2026 పరీక్షల వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు, ఎన్‌టీఏకే భౌతికంగా, మేధోపరంగా అవసరమైన వనరులు అందుబాటులో ఉండాలన్నదే తమ ఉద్దేశమని ధర్మాసనం స్పష్టంచేసింది. ఆరు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి సూచించింది. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

అలాగైతే సిఫార్సుల్లోనే లోపం

సుప్రీంకోర్టులో విచారణకు డాక్టర్ కె.రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. స్టీరింగ్ కమిటీ సిఫార్సుల అమలును ఎంతవరకు పర్యవేక్షించారని ధర్మాసనం ఆయనను ప్రశ్నించింది. నీట్ (యూజీ)లో వైఫల్యం ఎలా జరిగిందో చెప్పాలని సూచించింది. ఒకవేళ కమిటీ సిఫార్సు ఆధారంగా పర్యవేక్షణ జరిగినప్పటికీ, ఈ వైఫల్యం జరిగి ఉంటే.. అసలు సిఫార్సుల్లో లోపం ఉన్నట్లేనని అభిప్రాయపడింది. భవిష్యత్తులో తలెత్తబోయే పరిస్థితులను కమిటీ ఊహించలేకపోయినట్లే అవుతుందని తెలిపింది. రాధాకృష్ణన్ బదులిస్తూ.. ఇప్పటికే చాలా సిఫార్సులను అమలు చేయడం ప్రారంభమైందని అన్నారు. 2025లో నీట్ (యూజీ)ని సంతృప్తికరంగా నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకటి రెండుసార్లు విద్యుత్ అంతరాయం మినహా ఎలాంటి తప్పిదాలు జరగలేదన్నారు.

2027 నుంచి సీబీటీ విధానం

నీట్ (యూజీ) పరీక్షలో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నామని ఎన్‌టీఏ తెలియజేసింది. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) నిర్వహించబోతున్నట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీని సీబీటీ విధానానికి మార్చాలని ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ సిఫార్సు చేసినట్లు తెలిపింది. కేవలం ఈ ఏడాది మాత్రమే నీట్ (యూజీ) ప్రధాన పరీక్షను పెన్, పేపర్(పీపీటీ) విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. మిగతా అన్ని ప్రధాన ఎన్‌టీఏ పరీక్షలను ఇప్పటికే సీబీటీ విధానంలో నిర్వహిస్తున్నట్లు గుర్తుచేసింది.

కొనుగోళ్లలో మాదే రికార్డు

ఈకబురు,ప్రస్తుత సీజన్‌లో దేశంలో అత్యధిక మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తే... ఏపీలో 24 లక్షలు, తమిళనాడులో 12 లక్షలు, మహారాష్ట్రలో 3 లక్షలు, కేరళలో 2 లక్షల టన్నులు మాత్రమే సేకరించారని చెప్పారు. కేంద్రం అనుమతిచ్చిన దానికి మించి రూ.16,479 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిలతో కలిసి సచివాలయంలో మంత్రి ఉత్తమ్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ధాన్యం, బియ్యం సేకరణ కోటా కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. ఒకవైపు రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. కేంద్రం ఎఫ్‌సీఐ సేకరణ టార్గెట్‌ను ఏటా తగ్గిస్తోందని విమర్శించారు. బీజేపీ నేతలు కళ్లాల చుట్టూ తిరిగేబదులు, ఢిల్లీకి వెళ్లి అదనపు కోటా తీసుకురావాలని సూచించారు. ధాన్యం సేకరణపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 8,575 సెంటర్లలో కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని, చివరి ధాన్యం గింజను కొనుగోలుచేసేదాకా సెంటర్లను తెరిచే ఉంచుతామని తెలిపారు.

టార్గెట్‌కు మించి ధాన్యం కొనుగోళ్లు

రాష్ట్రంలో యాసంగిలో 141 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, 75 లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కేంద్రం కేవలం 52 లక్షల టన్నులకే అనుమతి ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 24 లక్షల టన్నులు కొనుగోలు చేస్తోందని వివరించారు. 13,000 వాహనాల్లో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, 2 లక్షల మంది సిబ్బంది అందుకోసం పనిచేస్తున్నారని వివరించారు. 2,008 రైస్‌మిల్లులు, 20.86 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీనాటికి రూ.11,050 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కేకొంటామని అన్నారు. 60 లక్షల టన్నుల్లో 10 వేల టన్నులు తడిస్తే బాయిల్డు మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. ఇసుక, సిమెంటు లారీలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గత పాలకులు పదేళ్లలో ఏటా సగటున రూ.15 వేల కోట్ల ఎమ్మెస్పీ చెల్లిస్తే... తాము ఏడాదికి రూ.49 వేల కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం విధించిన టార్గెట్‌లో 50 60 శాతమే కొనేవారని విమర్శించారు.

ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ తీరు: తుమ్మల

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఇంగిత జ్ఞానంలేకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మండిపడ్డారు. వాస్తవాలు వక్రీకరించి, ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాల్లో పండిన పంటనంతా కేంద్రం కొనుగోలు చేస్తూ.. తెలంగాణ రైతులకు మాత్రం ద్రోహం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మిగిలిన కోటి టన్నుల ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. మక్కలు క్వింటాలుకు కేంద్రం రూ.2,400 ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే రైతులు రూ.1,400 1,500లకే అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. కేంద్రం ఎమ్మెస్పీ ప్రకటించి చేతులెత్తేస్తే ఎవరు కొనాలని తుమ్మల నిలదీశారు. 11 లక్షల టన్నుల యూరియా కావాలని 3 నెలలుగా కోరుతుంటే.. 10 లక్షల టన్నులు ఇస్తామని చెప్పి, 5 లక్షల టన్నులు కూడా పంపలేదని విమర్శించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తమ సమావేశాలకు రైతులు రాకపోవటంతో బీఆర్ఎస్ నేతలు మిలిటెంట్ తరహా పోరాటాలకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికే బీజేపీ రైతుగోస యాత్ర చేపట్టిందని విమర్శించారు. వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే.. అందుకు కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

'నైరుతి'లో వర్షం తక్కువే!

ఈకబురు, దిల్లీ: దేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్‌సెప్టెంబరు) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90% వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. రానున్న ఏడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కీలక అంచనాలను ఐఎండీ శుక్రవారం వెలువరించింది. 1971 నుంచి 2020 వరకు సేకరించిన వర్షపాత గణాంకాల ఆధారంగా దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ)ను లెక్కిస్తారు. ఇది ప్రస్తుతం 87 సెంటీమీటర్లుగా ఉంది.

ఐఎండీ తాజా అంచనాల ప్రకారం..

జూన్‌సెప్టెంబరు మధ్య ఈశాన్య భారత్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుంది. దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

జూన్‌లో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం ఎల్‌పీఏలో 92% కంటే తక్కువే నమోదవుతుంది. ఎల్‌పీఏలో 90% కంటే తక్కువ వర్షం కురవడాన్ని లోటు వర్షపాతంగా పరిగణిస్తారు.

జూన్‌లో ఎల్ నినో పరిస్థితులు బలహీనంగా ఉంటాయి. సెప్టెంబరులో మాత్రం మధ్యస్థాయి నుంచి బలంగా ఉండొచ్చు.

జూన్‌లో దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువే నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ జాబితాలో ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, పంజాబ్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు ఉన్నట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

వడగాలులపై కేంద్రం, రాష్ట్రాల స్పందన కోరిన ఎన్‌జీటీ

దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) స్పందించింది. కేంద్ర ప్రభుత్వం సహా పలు రాష్ట్రాల నుంచి ఈ వ్యవహారంలో స్పందన కోరింది. తీవ్రమైన వడగాలుల కారణంగా ప్రజల ఆరోగ్యం, ఉత్పాదకత సహా పలు అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందంటూ ఓ వార్తాసంస్థ ప్రచురించిన కథనాన్ని ఎన్‌జీటీ సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగా వడగాలులపై తదుపరి విచారణ తేదీ (ఆగస్టు 18) లోపు ప్రమాణ పత్రం సమర్పించాలని కేంద్రంతో పాటు యూపీ, రాజస్థాన్, గుజరాత్ సహా పలు రాష్ట్రాలను, అటవీపర్యావరణ శాఖ తదితర విభాగాలను ఈ నెల 25న ఆదేశించింది.

స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు

ఈకబురు, అమరావతి

కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' పేరిట రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఆరు జిల్లాల పరిధిలో గుర్తించిన 262 పంచాయతీలను మురుగురహితంగా తీర్చిదిద్దడంతోపాటు గోదావరి నదిలో కాలుష్య కారక వ్యర్థాల విడుదలను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిర్వహణతోపాటు పారిశ్రామిక కాలుష్య పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యవేక్షణ బాధ్యతను ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి టాస్క్ ఫోర్స్ కి అప్పగించనున్నట్టు స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగు నివారణా చర్యలపై అధికారులకు పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అందుకోసం అవసరం అయితే వీబీ జీ రాం జీ, స్వచ్ఛాంధ్ర, కాలుష్య నియంత్రణ మండలి నిధులను కూడా వినియోగించుకోవాలని తెలిపారు.

గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం

గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో పుష్కరాల నిర్వహణ నిమిత్తం 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. ఉప ముఖ్యమంత్రి వారి కార్యాలయ అధికారులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శుల సమన్వయ సమావేశం నిర్వహించి 262 పంచాయతీలను పుష్కరాల నాటికి మురుగు విడుదల రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రతి రోజూ గోదావరిలో గ్రామీణ ప్రాంతాల మురుగు 8.38 మిలియన్ లీటర్లు

కలుస్తున్నట్లు గుర్తించారు. ఈ మురుగు నిర్వహణకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గృహ వినియోగ మురుగు నీటి నియంత్రణ, నిర్వహణ కోసం వీబీ జీ రాం జీ పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. బ్లాక్ వాటర్ నిర్వహణ కోసం సామాజిక ఇంకుడు గుంతల తరహా నిర్మాణాలు, ఇండివిడ్యువల్ హౌస్ హోల్డ్ ట్విన్ పిట్స్ చేపట్టాలని తెలిపారు. కాలువలు, డ్రెయిన్ల ద్వారా మురుగు నేరుగా గోదావరి నదిలోకి విడుదల కాకుండా పంచాయతీ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణా బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రమాదకర స్థితికి గోదావరి పరివాహక కాలుష్యం

మున్సిపాలిటీలు, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాలతో పాటు గోదావరి నదిలో కలుపుతున్న ఆక్వా కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరినట్టు పీసీబీ అధికారుల పరిశీలనలో తేలింది. ఆరు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి సుమారు రోజుకి 104 మిలియన్ లీటర్ల మురుగునీరు జీవ నదిని కలుషితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజు మరో 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు కూడా పెద్ద ఎత్తున నదిలో కలిపేస్తున్నారు. అందులో ఒక్క ఆంధ్రపేపర్ మిల్స్ నుంచే రోజుకి 32 మిలియన్ లీటర్ల వరకు వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం విడుదల అవుతున్న 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనం. ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా గోదావరి జలాలను కలుషితం చేస్తున్న మురుగు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల రూపంలో వెదజల్లే కాలుష్య నివారణకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదేశించారు.

మున్సిపాలిటీల్లో వ్యర్థ జల శుద్ధి కేంద్రాల నిర్మాణం

గోదావరి తీర ప్రాంత పట్టణాల నుంచి విడుదల అయ్యే మురుగు నీటిని శుద్ధి చేయకుండా నేరుగా గోదావరి నదిలో కలిపేస్తున్నట్టు గుర్తించారు. ప్రధాన పట్టణాలు అయిన రాజమహేంద్రవరం కార్పోరేషన్, కొవ్వూరు, నరసాపురం, తణుకు మున్సిపాలిటీలు నుంచి పెద్ద ఎత్తున మురుగు నీరు గోదావరిలోకి విడుదల అవుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పోరేషన్ నుంచి రోజుకి 75 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. తణుకు మున్సిపాలిటీల నుంచి రోజుకి సుమారు 11.1 మిలియన్ లీటర్లు, భీమవరం నుంచి 14 మిలియన్ లీటర్లు, నరసాపురం నుంచి 8.5 మిలియన్ లీటర్లు, కొవ్వూరు నుంచి 6 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు యనమదుర్రు, గోస్తనీ తదితర డ్రెయిన్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర మున్సిపాలిటీల నుంచి కూడా గోదావరి నదిలోకి నిత్యం మురుగునీటి విడుదల కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరం మాత్రమే గోదావరిలోకి విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇందుకోసం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గోదావరి కాలుష్య నియంత్రణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మంజూరు చేసిన రూ. 100 కోట్ల నిధులతోపాటు అవసరం అయితే స్వచ్ఛాంధ్ర నిధులు కూడా వినియోగించుకుంటూ దశల వారి ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై దశలవారీ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని గోదావరి పరివాహక మున్సిపాలిటీలన్నింటిలో ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

గోదావరిలో కలుపుతున్న పారిశ్రామిక కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదేశించారు. వాయు కాలుష్య నివారణకు పారిశ్రామిక వర్గాలు తగినంత పచ్చదనాన్ని పెంపొందించే ఏర్పాటు చేయాలి. మురుగు శుద్ధి, ద్రవరూప కాలుష్య నియంత్రణ కోసం అన్ని పరిశ్రమలు ఆధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశం చేశారు.స్వచ్ఛమైన గోదావరి జలాల్లో భక్తులంతా పవిత్రమైన పుష్కరాలు జరుపుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. పుష్కరాలకు ముందుగానే అన్ని విధాల చర్యలు తీసుకోవాలని, గ్రామీణ వ్యర్థాల తొలగింపు పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూము ఏర్పాటు చేసి వ్యర్థాల శుద్ధి, విడుదలపై నిరంతర సమాచారాన్ని తెలుసుకునే విధంగా ప్రత్యక్ష పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కంట్రోల్ రూంలో ప్రాంతాలవారీగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటిని సీసీ కెమెరాలతో అనుసంధానించాలని తెలిపారు. ఎక్కడెక్కడ మురుగు శుద్ధి చేస్తున్నారు. ఎక్కడైనా నేరుగా గోదావరి నదిలోకి మురుగుని వదులుతున్నారా తెలుసుకుని, ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చే వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల మురుగు నీటి నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్ కు కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిపారు.

గ్రీన్ ఎనర్జీ దిశగా ఏపీ

ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను... అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్దం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి

సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు తెలిపారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని... అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని.. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ' సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్-మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిత ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

సీఎంను కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవెల్యూషన్ C4IR అమలు చేయాల్సిన కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. C4IR ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్‌కో వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై C4IR అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని C4IR కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియేంటేషనుతో C4IR పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని C4IRకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

ఈకబురు, బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై పూర్తిస్థాయి స్పష్టత రావడంతో గందరగోళానికి తెరపడింది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయడంతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ప్రభుత్వ పగ్గాలు చేపట్టడం దాదాపుగా ఖరారైంది. ఇందుకు అవసరమైన ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై కసరత్తు సాగుతోంది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వేర్వేరుగా ఢిల్లీకి చేరుకున్నారు.

మంత్రివర్గంలో తమ అనుచర వర్గానికి చోటు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు బెంగళూరు విధాన సౌధలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) సమావేశం జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు పాల్గొంటారు. కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు డీకే శివకుమార్‌ను సీఎల్పీ నేతగా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అభ్యర్థిత్వాన్ని కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సూర్జేవాలా ప్రతిపాదించనున్నారు. ఈ ప్రతిపాదనకు పార్టీ ఎమ్మెల్యేలు ఆమోదం తెలపాల్సి ఉంది. సీఎల్పీ నేతను ఎన్నుకున్న తర్వాత ఎమ్మెల్యేల మద్దతు లేఖను లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు అందజేస్తారు.

కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని గవర్నర్‌కు తెలియజేస్తారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ ఆహ్వానిస్తే.. సోమవారం విధానసౌధ వద్ద కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రమాణ స్వీకార శుభముహూర్తం కోసం ఆయన ఇప్పటికే జ్యోతిష్యులను సంప్రదించినట్లు సమాచారం. సోమవారం మంచి ముహూర్తం ఉందని వారు సూచించినట్లు తెలిసింది. విధాన సౌధ ఎదుట ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మయ్య, డీకేఎస్

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలుసుకొని ధన్యవాదాలు తెలియజేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గం కూర్పుపై సుమారు గంటకు పైగా చర్చించారు. అలాగే సిద్ధరామయ్య రాజకీయ భవిష్యత్తుపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ రాజకీయాల్లోకి రావాల్సిందిగా ఆయనను మరోసారి ఆహ్వానించినట్లు సమాచారం.

ఈ సందర్భంగా సిద్ధరామయ్య వెంట ఆయన కుమారుడు యతీంద్ర, సీనియర్ మంత్రి కేజే జార్జ్ కూడా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఇప్పటివరకు తనకు అవకాశం కల్పించినందుకు, సహకరించినందుకు అధిష్టానం పెద్దలకు సిద్ధరామయ్య కృతజ్ఞతలు తెలిపారు. డీకే శివకుమార్ సైతం పార్టీ అగ్రనేతలను కలుసుకున్నారు. మంత్రివర్గంలో తన వర్గం ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది.

రాజీనామాకు గవర్నర్ ఆమోదం

సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ గెహ్లాట్ శుక్రవారం ఉదయం ఆమోదం తెలిపారు. రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ఈ మేరకు గెజిట్ విడుదల చేశారు. నూతన సీఎం ప్రమాణస్వీకారం చేసేదాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యను గవర్నర్ కోరారు. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కేపీసీసీ ఆదేశించింది. ఢిల్లీలో ఉన్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, రణదీప్ సింగ్ సూర్జేవాలా శుక్రవారం రాత్రి బెంగళూరుకు తిరిగి వచ్చారు.

మంత్రి పదవుల కోసం లాబీయింగ్

కొత్తగా ఏర్పడనున్న మంత్రివర్గంలో చోటు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లాబీయింగ్ ప్రారంభించారు. చాలామంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హైకమాండ్‌తో మంత్రివర్గ కూర్పుపై సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది.

తమ సన్నిహిత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కేలా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. తమ వర్గానికి అత్యధిక మంత్రి పదవులు దక్కించుకునేందుకు ఇరువురు నేతలు పోటీ పడుతున్నారు. ఈసారి మంత్రివర్గంలో కొత్తముఖాలకు ఎక్కువగా ప్రాధాన్యం దక్కుతుందని ఊహాగానాలు సాగుతున్న తరుణంలో సీనియర్ మంత్రులు, ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గీయుల్లో టెన్షన్ పెరుగుతోంది. 40 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రివర్గంలో చోటు కోసం ప్రయతిస్నస్తున్నారు.

సిద్ధరామయ్యపై డీకేఎస్ పొగడ్తల వర్షం

డీకే శివకుమార్ 'ఎక్స్'లో సిద్ధరామయ్యపై పొగడ్తల వర్షం కురిపించారు. ''దేవుడు వరం ఇవ్వడు, శాపం కూడా ఇవ్వడు, అవకాశం మాత్రం ఇస్తాడు. ఆ అవకాశంతో ఏం సాధిస్తామనేది ముఖ్యం'' అంటూ వేదాంత ధోరణిలో స్పందించారు. అవకాశాలను అందిపుచ్చుకుని విజయం సాధించిన వారిలో ముఖ్యుడు సిద్ధరామయ్య అని కొనియాడారు. మైసూరు జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించి, పోరాటం ద్వారా రాజకీయాల్లోకి వచ్చి, సామాజిక న్యాయం అందిస్తూ, పేదల పెన్నిధిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య సేవలందించారని డీకే శివకుమార్ ప్రశంసించారు. కర్ణాటక రాజకీయ చరిత్రలో అత్యంత విజయవంతంగా, దీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా పనిచేసి సామాన్య ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారని ఉద్ఘాటించారు. నూతన మంత్రివర్గ ఏర్పాటుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఢిల్లీలో డీకే శివకుమార్ తెలిపారు.

రైతు డిస్కమ్.. ప్రభుత్వ కుట్ర

ఈకబురు,,హైదరాబాద్ :

రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయంపై ఎండ్రిన్ చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరించారు. తెలంగాణ రైతుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయిబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు.

1999 నాటి కాల్పుల ఘటన కొని తెచ్చుకోవద్దు

రైతు డిస్కమ్ పేరుతో ఈ ప్రభుత్వం పచ్చిదగా చేస్తోందని కవిత అన్నారు. ఈ నిర్ణయం మంచిదే అయితే ఆరు నెలల నుంచి ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని సీక్రెట్ గా ఉంచిందో చెప్పాలన్నారు. ఈఆర్సీ కారణంగా ఈ అంశం బయటకు వచ్చిందే తప్ప ప్రభుత్వం బయటపెట్టలేదని గుర్తు చేశారు. నిజానికి ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీ లో చర్చ పెట్టాలన్నారు. కానీ సీక్రెట్ గా ఇదంతా చేస్తుందంటేనే కచ్చితంగా ఇందులో దురుద్దేశం ఉందన్నది అర్థమవుతుందని కవిత చెప్పారు. రైతులు ఎవరు అడగకుండానే రైతు డిస్కం అవసరమేమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. అసలే డిస్కమ్ ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కమ్ ను కంపెనీ పేరుతో ఎలా రిజస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు.

రైతులకు ఇచ్చే ఫ్రీ కరెంట్, ఉచిత విద్యుత్ స్కీం, లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వాడే పవర్ కు ప్రభుత్వమే డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఈ సంస్థ ఏ విధంగా లాభాల్లో ఉంటుందో చెప్పాలన్నారు. కేవలం రైతులకు నష్టం చేసేందుకు ఈ పిచ్చి పనిచేస్తున్నారని కవిత విమర్శించారు. రైతులకు అన్యాయం చేస్తే 1999 నాటి కాల్పుల ఘటన పునరావృతం అయ్యే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. అలాంటి సంఘటనలు కొని తెచ్చుకోవద్దంటే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు నష్టమే

రైతు డిస్కం కారణంగా మేలు జరగకపోగా రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని కవిత అన్నారు. కొత్త డిస్కం కు 42 శాతం లోడ్ ట్రాన్ ఫర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోందని... కానీ అందుకు తగిన విధంగా ఉద్యోగులను మాత్రం కేటాయించటం లేదన్నారు. మొత్తం డిస్కం లలో 45 వేల మంది ఉద్యోగులు ఉంటే కొత్త డిస్కం కు 2 వేల మంది ఉద్యోగులను మాత్రమే ట్రాన్స్ ఫర్ చేస్తామంటున్నారన్నారు. దీని కారణంగా ట్రాన్స్ ఫార్మర్లు రిపేర్ వస్తే రెండు నెలల పాటు ఎదురుచూసే పరిస్థితి ఉంటుందన్నారు. పైగా ఇంతకు ముందు నియోజకవర్గ కేంద్రంలో ట్రాన్ ఫార్మర్ రిపేర్ సెంటర్ ఉంటే ఇప్పుడు అది తాలుకాకు మారే పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో రైతులకు నష్టం జరుగుతుందని చెప్పారు. తెలంగాణలో 29 లక్షల బోర్లు ఉన్నాయని ఈ కొత్త డిస్కం కారణంగా ఆయా బోర్ల పరిస్థితి డోలాయామనంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వమే దోషి

డిస్కమ్ ల పరిస్థితి బాగాలేదని ప్రభుత్వమే చెబుతోందని కవిత గుర్తు చేశారు. మన డిస్కమ్ లకు మైనస్ సీ రేటింగ్ ఉందని అంటున్నారని కానీ దానికి ఈ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. డిస్కం ల బకాయిలు రూ. 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కమ్ లు మంచి రేటింగ్ లలోకి వస్తాయని చెప్పారు. పైగా కొత్త డిస్కం కు యూనిట్ 6 రూపాయలు ఖర్చయ్యే థర్మల్ విద్యుత్ ను కేటాయిస్తున్నారని చెప్పారు. దీనికి తోడు కొత్త డిస్కం లో వీలింగ్ ఛార్జీలు కూడా యాడ్ చేస్తామంటున్నారన్నారు. ప్రభుత్వమే ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్, రైతులకు ఇచ్చే విద్యుత్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే రూ. 54 వేల కోట్లు పెండింగ్ పెట్టిన ప్రభుత్వం కొత్త డిస్కమ్ కు ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని ప్రశ్నించారు. ఈ లెక్కన రైతు డిస్కం ఏ విధంగా లాభాల్లో ఉంటుందో చెప్పాలన్నారు. డిస్కంల నష్టాలను సాకుగా చూపి ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. అటు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తుందన్నారు. విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం పెట్టిన అన్ని కండిషన్స్ ఒప్పుకునే విధంగా రేవంత్ సర్కార్ చర్యలు చేపడుతోందని కవిత విమర్శించారు.

33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి

తెలంగాణ రైతాంగం భవిష్యత్ ను నిర్ణయించే ఈ అంశాన్ని ఏసీ రూముల్లో కూర్చొని నిర్ణయించటం సరికాదని కవిత అన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని ఈఆర్సీని కోరారు. ఈఆర్సీ నుంచి ఎలాంటి అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కం పని ప్రారంభమవుతుందని సీఎం మాట్లాడటం సరికాదని చెప్పారు. రైతు డిస్కం విషయంలో ముందు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని కోరారు. గతంలో ఎనర్జీ అడిట్ స్కీమ్ లు ఎప్పుడు కూడా సక్సెస్ కాలేదని కవిత గుర్తు చేశారు. అందుకే ముందు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలన్నారు. లేదంటే పెద్ద మొత్తంలో ఉన్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కొత్త డిస్కమ్ కారణంగా కొత్తగా ఎక్కువ గంటలు కరెంట్ ఇస్తారా? ఇప్పుడున్న డిస్కమ్ లో సమస్యలను పరిష్కరించుకుంటే సరిపోయేదానికి ఎందుకు కొత్త డిస్కమ్ అని కవిత ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో వాయెబుల్ కానీ ఈ ప్రపోజల్ ను ఈఆర్సీ రిజెక్ట్ చేయాలని కవిత కోరారు.

–ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం వద్దు

రైతు డిస్కం వద్దే వద్దంటే అందులో ఆంధ్రా ఉద్యోగులకు పెత్తనం కట్టేబెట్టే ప్రయత్నం చేస్తున్నారని కవిత అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటలు కరెంట్ వచ్చేందుకు తెలంగాణ ఉద్యోగులు కష్టపడితే వారికే కష్టమొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 వందల మంది తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు నష్టం చేశారని చెప్పారు. అదే సమయంలో ఆంధ్రా నుంచి మన వద్దకు వచ్చిన 17 వందల మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చారన్నారు. విభజన చట్టాలను పక్కన పెట్టి ఫోర్స్ ఫుల్ గా ఆంధ్రా ఉద్యోగులను మనకు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే జెన్ కో, రెడ్ కో, సదరన్ డిస్కమ్ ఇలా అన్నింట్లో ఆంధ్రావాళ్ల పెత్తనమే ఉందన్నారు. తెలంగాణ డిస్కమ్ లలో ఆంధ్రావాళ్ల పెత్తనం ఉండొద్దని కవిత కోరారు. రైతు డిస్కం తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టాల్సి వస్తే అందులో తెలంగాణ వాళ్లే ఉండాలని డిమాండ్ చేశారు.

పండిన ప్రతిగింజనూ ప్రభుత్వం కొనాలి

ఈ-కబురు, హైదరాబాద్: కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అని భారాస శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని 90 లక్షల టన్నుల నుంచి 75 లక్షల టన్నులకు తగ్గించిన మంత్రి ఉత్తమ్.. మరికొన్ని రోజుల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటిస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఒకవైపు 1.41 కోట్ల టన్నుల పంట పండిందని గొప్పలు చెబుతూ.. మరోవైపు కొనుగోలు మాత్రం 75 లక్షల టన్నులకే పరిమితమంటారా? చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామంటూనే.. కొనుగోలు లక్ష్యాన్ని తగ్గించడం రైతులను మోసగించడం కాదా? వరి కుప్పల వద్ద రైతులు ప్రాణాలు కోల్పోయింది.. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాసింది అబద్ధమా? హైదరాబాద్‌లో ఏసీ గదుల్లో కూర్చొని ప్రసంగిస్తే.. రైతుల గోడు తీరదు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులు పడుతున్న కష్టాలు చూసి.. కన్నీళ్లు తుడవండి. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయండి'' అని డిమాండ్ చేశారు.

రైతులకు మూడు గంటల కరెంటు చాలు అని కాంగ్రెస్ ప్రభుత్వం తన మనసులోని మాటను బయటపెట్టిందని హరీశ్ విమర్శించారు. ''విద్యుత్ కమిషన్ ముందు రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలు.. రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక స్వభావాన్ని బట్టబయలు చేశాయి. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతులు రాత్రింబవళ్లు ఎలా కష్టపడతారో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడగలరు. భారాస ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి.. తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టింది. కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది'' అని పేర్కొన్నారు.

స్పెల్లింగ్‌బీ విజేతగా 14 ఏళ్ల ఇండో

అమెరికన్ శ్రేయ్ పారిఖ్

ఈకబురు, వాషింగ్టన్: అమెరికాలో నిర్వహించిన స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి శ్రేయ్ పారిఖ్(14) విజయం సాధించాడు. కాలిఫోర్నియాలోని ఇండోఅమెరికన్ కుటుంబానికి చెందిన శ్రేయ్.. ఫైనల్స్‌లో భారతీయ మూలాలున్న మరో పోటీదారు ఇషాన్ గుప్తా(12)ను ఓడించి విజేతగా నిలిచాడు. శ్రేయ్ 90 సెకన్లలో 35 పదాలకుగానూ 32 పదాలకు సరైన స్పెల్లింగ్ చెప్పాడు. 2024 ఎడిషన్‌లో కూడా ఇతడు ఫైనల్స్‌కు చేరగా.. తాజా పోటీల్లో విజేతగా నిలిచి ట్రోఫీ దక్కించుకున్నాడు. ఈ విజయంతో 50 వేల డాలర్ల నగదు, పతకం, స్క్రిప్స్ కప్, మెరియం వెబ్‌స్టర్ నుంచి 2,500 డాలర్లు, డెల్టా నుంచి 1000 డాలర్ల విలువైన ఫ్లైట్ క్రెడిట్లు, ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా నుంచి 400 డాలర్ల విలువైన రిఫరెన్స్ వర్క్ శ్రేయ్‌కు లభించనున్నాయి. ఈ పోటీల్లో 247 మంది పాల్గొనగా, ఫైనల్స్‌కు చేరుకున్న తొమ్మిది మందిలో ఐదుగురు భారతీయ మూలాలున్నవారే కావడం విశేషం.

రాహుల్‌ను కలిసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఈకబురు, దిల్లీ: శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ దిల్లీలో శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని కలిశారు. రాష్ట్రంలో త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఆయన రాహుల్‌గాంధీని కలిసి తన మనోభావాలు పంచుకున్నట్లు సమాచారం. తొలి నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ఆయన్ను పార్టీ నాయకత్వం అనూహ్యంగా స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టింది. అయితే ఆ విషయంలో కొంత భిన్నాభిప్రాయంతో ఉన్న ఆయన ఇప్పుడు మంత్రి పదవి కోరుతున్నట్లు తెలిసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికీ ప్రాతినిధ్యం లేనందున తనకు అవకాశం కల్పించాలని ఆయన రాహుల్‌గాంధీని కోరి ఉండొచ్చని సన్నిహితులు చెబుతున్నారు.

మనకూ వార్నిష్డ్ కరెన్సీ

దేశంలో కరెన్సీ నోట్ల వినియోగం భారీగా పెరిగింది. రోజువారీ లావాదేవీల్లో డిజిటల్ చెల్లింపులు శరవేగంగా పెరుగుతున్నా.. సాధారణ ప్రజలు, చిన్న వ్యాపారులు నగదు లావాదేవీలకే మొగ్గుచూపుతున్నారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వార్షిక నివేదికలో తెలిపింది. దీని వల్ల దేశ కరెన్సీ- జీడీపీ నిష్పత్తి 2024-25 నాటి 11.7% నుంచి 2025-26లో 12.1 శాతానికి పెరిగింది. మార్కెట్‌లో నకిలీ నోట్ల చలామణీ స్వల్పంగా పెరగడంతో, వాటిని అరికట్టేందుకు, నోట్ల మన్నికను పెంచేందుకు ఆర్‌బీఐ నోట్లలో కొత్త సెక్యూరిటీ ఫీచర్లతో పాటు, వార్నిష్డ్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది.

వార్నిష్ కరెన్సీ నోట్లు అంటే..

పలుచని, రక్షిత అల్ట్రా వయొలెట్ క్యూర్‌డ్ వార్నిష్ పూతపూసిన కాగితపు నోట్లు. నీటిలో తడిచినా, దుమ్ములో పడినా తొందరగా పాడవకుండా ఉంటాయి. తరచు నోట్లు పాడయి, కొత్తవి ముద్రించేందుకు అవుతున్న ఖర్చు తగ్గించేందుకు ఇవి ఉపయోగ పడతాయి. సాధారణ నోట్లతో పోలిస్తే, ఇవి 2-3 రెట్లు అధిక కాలం మన్నుతాయన్నది అంచనా. ఇందుకోసం కర్ణాటకలోని మైసూరులో ఉన్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ కేంద్రంలో రూ.100 నోటుపై పరిశోధనలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఐరోపాలోని కొన్ని దేశాలు ఇలాంటి నోట్లు వాడుతున్నాయి.

రూ.500 నోట్ల హవా

2026 మార్చికి మార్కెట్‌లో ఉన్న కరెన్సీ నోట్ల మొత్తం విలువ 11.9% పెరిగి రూ.41.24 లక్షల కోట్లకు చేరింది. చలామణీలో ఉన్న నోట్ల సంఖ్య 10.5% వృద్ధి 17.13 లక్షల కోట్లకు పెరిగింది. నాణేల విలువ 11.4% అధికమై రూ.40,814 కోట్లుగా ఉంది. మార్కెట్ నుంచి రూ.2000 నోట్లను ఉపసంహరించడంతో, రూ.500 నోటు మన నగదు వ్యవస్థకు ప్రధాన వెన్నెముకగా మారింది. మొత్తం మార్కెట్‌లో ఉన్న నోట్ల సంఖ్యలో రూ.500 నోట్ల వాటా 41.2 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో వినియోగంలో ఉన్న రూ.500 నోట్ల సంఖ్య 6,34,458 లక్షల నుంచి 11.2% అధికమై 7,05,482 లక్షలకు చేరింది. వీటి విలువ రూ.31.72 లక్షల కోట్ల నుంచి రూ.35.27 లక్షల కోట్లకు పెరిగింది.

నకిలీ నోట్లూ అధికం : నగదు చెలామణితో పాటు నకిలీ నోట్ల బెడదా పెరిగింది. దేశంలో పట్టుబడిన మొత్తం నకిలీ నోట్ల సంఖ్య 2024-25లో 2,17,396 కాగా, 2025-26లో 5.7% 2,29,746కు పెరిగింది. ఇందులో ప్రధానంగా రూ.500 నకిలీ నోట్లు 20.5% పెరిగి 1,41,907గా ఉన్నాయి. రూ.20 నకిలీ నోట్లు 253 నుంచి 47.4% అధికమై 373కు చేరాయి. రూ.200 నకిలీ నోట్లు 32,660 నుంచి 30,591కు, రూ.100 నకిలీ నోట్లు 51,069 నుంచి 45,621కు తగ్గాయి. మార్కెట్‌లో మొత్తం నకిలీ నోట్లలో 97.6% నోట్లను బ్యాంకులు విజయవంతంగా గుర్తించాయి.

తగ్గిన కరెన్సీ ప్రింటింగ్ ఖర్చులు: ఆర్‌బీఐ నోట్ల ముద్రణ వ్యయాలు 2025-26లో రూ.4,875.2 కోట్లకు తగ్గాయి. 2024-25లో ఈమొత్తం రూ.6,372.8 కోట్లుగా ఉంది. ఆర్‌బీఐ కొత్త నో

ముంచిన ఎల్‌నినో భయాలు

దేశవ్యాప్తంగా ఈ ఏడాది 11 ఏళ్ల కనిష్ట స్థాయిలో వర్షపాతం నమోదు అవుతుందంటూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) నివేదిక వెల్లడితో ట్రేడింగ్ చివర్లో ఫైనాన్స్, చమురు షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అమెరికా, ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం ఇంకా పూర్తిగా ఖరారు కాకపోవడం, ఎంఎస్‌సీఐ సూచీ మార్పులు అమలులోకి రావడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 1,092 పాయింట్లు క్షీణించి 74,775 వద్ద ముగిసింది. నిఫ్టీ 359 పాయింట్లు పతనమై 23,548 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్ ఒకటిన్నర శాతానికిపైగా పతనంతో, ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.77 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. దీంతో మొత్తం మార్కెట్ క్యాప్ రూ.465 లక్షల కోట్లకు దిగివచ్చింది.

లాభాల్లోంచి భారీ నష్టాల్లోకి

అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణ పొడిగింపు వార్తలతో క్రూడాయిల్ ధరలు తగ్గడం, అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ప్రథమార్థంలో 352 పాయింట్లు పెరిగి 76,220 వద్ద, నిఫ్టీ 96 పాయింట్లు బలపడి 24,003 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మిడ్ సెషన్ నుంచి అమ్మకాలతో తలెత్తడంతో పాటు ట్రేడింగ్ చివర్లో అనూహ్య లాభాల స్వీకరణతో సూచీలు లాభాల్లోంచి భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,279 పాయింట్లు క్షీణించి 74,589 వద్ద, నిఫ్టీ 422 పాయింట్లు పతనమై 23,4845 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి.

రంగాల వారీ ఇండెక్స్‌ల్లో

బీఎస్ఈలో ఆయిల్ అండ్ గ్యాస్ 2.75%, మెటల్ 2.30%, వినిమయ 2.23%, హాస్పిటల్స్ 2.16%, ఇంధన 2.08%, కమోడిటీస్ 1.94%, ఆటో 1.90%, సర్వీసెస్ 1.58 శాతం పతనమయ్యాయి. స్మాల్ క్యాప్ సూచీ 1.26%, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.73 శాతం నష్టపోయాయి.

నాలుగు షేర్లకు మాత్రమే లాభాలు:

సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లలో టెక్ మహీంద్రా (2%), హెచ్‌సీఎల్‌టెక్ (1.65%), ఎల్‌అండ్‌టీ (0.76%), ఇన్ఫోసిస్ (0.05%) మాత్రమే లాభపడ్డాయి. మరోవైపు, అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(–2.18%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (–1.81%), ఐసీఐసీఐ బ్యాంక్ (–1.32%), ఎంఅండ్‌ఎం(–2.72%), బజాజ్ ఫైనాన్స్ (–2.82%) షేర్లు నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. సెన్సెక్స్ కోల్పోయిన పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 600 పాయింట్లు కావడం విశేషం.

ఇండిగో నష్టం రూ.2,537 కోట్లు

దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, జనవరి మార్చి త్రైమాసికానికి రూ.2,537 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ క్షీణించడం, కార్మిక చట్టంలో మార్పులు, కార్యకలాపాల నిర్వహణలో సవాళ్లు ఇందుకు కారణమయ్యాయి.202425 ఇదే కాలంలో సంస్థ రూ.3,067.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించడం గమనార్హం. ఏడాది వ్యవధిలో మొత్తం ఆదాయం రూ.23,097.50 కోట్ల నుంచి 3% పెరిగి రూ.23,830.70 కోట్లకు చేరింది. 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికీ ఇండిగో రూ.2,393.60 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 202425లో రూ.7,502.50 కోట్ల నికర లాభాన్ని సంస్థ నమోదు చేసింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 6.4% పెరిగి రూ.89,513.40 కోట్లకు చేరింది.

నష్టం ఎందుకంటే..: 202526లో విదేశీ మారకపు ద్రవ్యం రూపంలో రూ.8,100 కోట్ల నష్టం వచ్చిందని కంపెనీ తెలిపింది. 2025 డిసెంబరులో విమాన సర్వీసుల్లో ఏర్పడిన భారీ అంతరాయాల వల్ల, రూ.580 కోట్ల ప్రతికూల ప్రభావం పడిందని వెల్లడించింది. కొత్త కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన వ్యయాలు రూ.1,200 కోట్లుగా నమోదయ్యాయి. '202526లో చాలా సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొన్నాం. ఈ పరిణామాలే లాభదాయకతపై ప్రభావం చూపాయి. అయితే మా సీట్ల సామర్థ్యం 9.5% పెరిగింద'ని ఇండిగో ఎండీ రాహుల్ భాటియా తెలిపారు.

దేశీయ విపణిలోకి టెస్లా 'మోడల్ వై ప్రీమియం'

అమెరికా విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా, సరికొత్త 2026 మోడల్ వై ప్రీమియం రేర్ వీల్ డ్రైవ్ కారును మన దేశీయ విపణిలోకి విడుదల చేసింది. ఈ కారు ధర రూ.50.89 లక్షలు. మన దేశంలో ఇప్పటివరకు టెస్లా విక్రయిస్తున్న కార్లలో ఇదే తక్కువ ధర మోడల్. ఈ కారును ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే, గరిష్ఠంగా 500 కి.మీ (డబ్ల్యూఎల్‌టీపీ సర్టిఫైడ్) ప్రయాణించొచ్చు. కేవలం 5.9 సెకన్లలోనే గంటకు 0-100 కి.మీ వేగాన్ని ఈ కారు అందుకుంటుందని సంస్థ పేర్కొంది. గత నెలలో కంపెనీ తన రెండో మోడల్ (3 వరుసల్లో ఆరు సీట్లు) ఎస్‌యూవీ మోడల్ వైఎల్ (ధర రూ.61.99 లక్షలు) విడుదల చేసింది. గత ఏడాది మోడల్ వై (రూ.59.89 లక్షలు)తో మన విపణిలోకి సంస్థ ప్రవేశించిన సంగతి విదితమే.

69% పెరిగిన ఏషియన్ పెయింట్స్ లాభం

దిల్లీ: ఏషియన్ పెయింట్స్, మార్చి త్రైమాసికంలో రూ.1185.49 కోట్ల ఏకకృత నికరలాభాన్ని ఆర్జించింది. 202425 ఇదేకాల లాభం రూ.700.83 కోట్ల కంటే ఇది 69.15% అధికం. ఇదే సమయంలో విక్రయ ఆదాయం రూ.8329.59 కోట్ల నుంచి రూ.9228.46 కోట్లకు పెరిగింది. రంగుల పరిమాణం, విలువ పరంగా కూడా సమీక్షా త్రైమాసికంలో రెండంకెల వృద్ధి సాధించడం, పారిశ్రామిక వాహన రంగాల నుంచి గిరాకీ లభించడం ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. దేశీయ అలంకరణ విభాగంలోనూ గిరాకీ అధికంగా ఉన్నట్లు తెలిపింది. శ్రీలంక, ఈజిప్ట్, యూఏఈల్లో వృద్ధి వల్ల, అంతర్జాతీయ విక్రయాలు 11% పెరిగి రూ.888.1 కోట్లుగా నమోదయ్యాయి. వ్యయాలు కూడా 7.6% పెరిగి రూ.7829.17 కోట్లకు చేరాయి.202526 పూర్తి ఆర్థిక సంవత్సరంలో సంస్థ లాభం రూ.4394.69 కోట్లుగా, ఆదాయం రూ.36,307.34 కోట్లుగా నమోదయ్యాయి. తుది డివిడెండుగా రూ.23 ఇవ్వాలని కంపెనీ బోర్డు ప్రతిపాదించింది. పశ్చిమాసియా సంక్షోభ పరిణామాలు, సమీప కాల అనిశ్చితులకు కారణమవుతున్నట్లు సంస్థ ఎండీ అమిత్ పేర్కొన్నారు.

ఐపీవోకు 3 కంపెనీలు రెడీ

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మూడు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో రోడెక్ ఫార్మా, రెన్నీ స్ట్రిప్స్, కృష్ణా బిల్డ్‌స్పేస్ చేరాయి. లిస్టింగ్‌కు అనుమతించమంటూ రెన్నీస్ట్రిప్స్ 2025 డిసెంబర్‌లో, రోడెక్ ఫార్మా, కృష్ణా బిల్డ్‌స్పేస్ 2026 జనవరిలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి.

ఓఎఫ్ఎస్ ద్వారా

వెటర్నరీ ఫార్మా ప్రొడక్టుల కంపెనీ రోడెక్ ఫార్మా పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) బాటలో సాగనుంది. ప్రమోటర్ ముకేష్ కుమార్ గుప్తా 56.5 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. దీంతో నిధులు కంపెనీకికాకుండా ప్రమోటర్లకు చేరనున్నాయి. 1997లో ఏర్పాటైన కంపెనీ జంతు ఆహార సంబంధ(యానిమల్ ఫీడ్) సప్లిమెంట్స్ తయారీతోపాటు వెటర్నరీ ఫార్మాస్యూటికల్ ప్రొడక్టుల మార్కెటింగ్ చేపడుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో తయారీ ప్లాంటు కలిగి ఉంది.

ఈక్విటీ జారీసహా..

వివిధ పరిశ్రమలలో వినియోగించే మైల్డ్ స్టీల్ బిల్లెట్‌స్‌సహా.. విభిన్న స్ట్రక్చరల్ ప్రొడక్టులు రూపొందించే రెన్నీ స్ట్రిప్స్ ఐపీవోలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.2 కోట్ల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను లూధియానాలో స్మఫోల్డింగ్, ఫామ్‌వర్క్ సిస్టమ్స్, ఈఆర్‌డబ్ల్యూ పైపులు, ట్యూబుల తయారీ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. అంతేకాకుండా ప్రస్తుత ప్లాంట్ల ఆధునీకరణ, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం కేటాయించనుంది.

నిర్మాణ రంగ సంస్థ నిర్మాణ రంగ గుజరాత్ కంపెనీ కృష్ణా బిల్డ్‌స్పేస్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా 90 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు 9 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. 1995లో ఏర్పాటైన కంపెనీ కాంట్రాక్టింగ్, బిల్డింగ్ సర్వీసులందిస్తోంది. ఐపీవో చేపట్టడం ద్వారా మూడు కంపెనీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్‌కానున్నాయి.

ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.

ఆ రెండేళ్ల కష్టానికి.. ప్రతిఫలం దక్కింది: జగపతి బాబు



అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు.''సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా'' అని జగపతి బాబు అన్నారు.సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

'డాన్ 3' నుంచి రణ్‌వీర్ ఎగ్జిట్.. రేసులోకి షారుక్.. అట్లీ!

బాలీవుడ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న 'డాన్ 3' సినిమా కొన్ని రోజులుగా వార్తల్లో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఒక వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఆ ఫ్రాంచైజీ లోకి మళ్లీ షారుక్ ఎంట్రీ ఇస్తే బాగుంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. గతంలో రెండు భాగాల్లోనూ షారుక్ ఖాన్ తన అద్భుతమైన నటనతో 'డాన్' పాత్రకు ప్రాణం పోశారు. అయితే మూడో భాగం స్క్రిప్ట్ విషయంలో విముఖత వ్యక్తం చేస్తూ ఆయన ఈ సినిమాను తిరస్కరించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు 'డాన్ 3' నుంచి రణ్‌వీర్ వైదొలగడంతో మూవీ టీమ్ మళ్లీ షారుక్‌తో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.అయితే, షారుక్ ఈ సినిమా చేయడానికి ఒక ఆసక్తికరమైన కండిషన్ పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 'జవాన్' చిత్రంతో తనకు భారీ బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు అట్లీని ఈ ఫ్రాంచైజీలోకి తీసుకొస్తేనే తాను మళ్లీ 'డాన్' పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారట. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ బాలీవుడ్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2022లో షారుక్ 'డాన్ 3'ని నిరాకరించడంతో మేకర్స్ రణ్‌వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కిన 'ధురంధర్' ఘనవిజయం తర్వాత రణ్‌వీర్ సింగ్ తన ఎంపికల విషయంలో జాగ్రత్త వహిస్తూ 'డాన్' మూడో భాగం నుంచి వైదొలిగారు. దీనిపై వివాదం కొనసాగుతోంది. ఇక ఈ సినిమాలో ఇతర నటీనటుల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. హీరోయిన్‌గా మొదట కియారా అద్వాణీని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం ఆమె స్థానంలో కృతి సనన్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే విలన్ పాత్ర కోసం విక్రాంత్ మాస్సే, విజయ్ దేవరకొండలను సంప్రదించారని టాక్..!

500 మంది.. అడవిలో 70 రోజుల షూట్

... 50 ఏళ్ల 'భక్త కన్నప్ప' విశేషాలివీ

'భక్త కన్నప్ప' పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు కృష్ణంరాజు గుర్తొస్తారనడంలో అతిశయోక్తి లేదు. అయితే, అదంత తేలిగ్గా జరగలేదు. ముందు అనుకున్న దర్శకుడు వైదొలిగినా.. బడ్జెట్ మించినా వెనకడుగేయలేదు. ప్రతికూల వాతావరణంలో షూటింగ్ చేసి, నిర్మాతగానూ తన మార్క్ చూపించారు. ఈ భక్తి చిత్రానికి నేటితో 50 ఏళ్లు. సినిమాని తలపించే తెర వెనుక విశేషాలివీ..

కృష్ణంరాజు 'బెన్ హర్', 'ది టెన్ కమాండమెంట్స్' లాంటి హాలీవుడ్ సినిమాలను ఎక్కువగా చూసేవారు. ఆ స్థాయిలో ఓ పౌరాణిక చిత్రం తెలుగులో తీయాలనుకున్నారు. అలా 'భక్త కన్నప్ప'కు బీజం పడింది.తనకు అంతకుముందు హిట్ ఇచ్చిన దర్శకుడు మధుసూదనరావుతోనే ఈ చిత్రాన్ని చేయాలనుకున్నారు కృష్ణంరాజు. కొన్ని పాటలు కూడా రికార్డు చేశారు. కానీ, అనూహ్యంగా ఆయన వైదొలిగారు.అదే సమయంలో 'ముత్యాలముగ్గు'తో విజయం అందుకున్నారు దర్శకుడు బాపు. దీంతో కృష్ణంరాజు ఆయన్ను సంప్రదించి.. భక్త కన్నప్ప గురించి చెప్పారు. కొన్ని మార్పులు అవసరమని సూచించి, ఆ బాధ్యతను ముళ్లపూడి వెంకటరమణకు అప్పగించారు బాపు.కృష్ణంరాజుకు ఇది 77వ చిత్రం. బాపు దర్శకత్వం వహించిన 10వ సినిమా. అవుట్‌డోర్‌లోనే షూటింగ్ జరిగింది. బుట్టాయిగూడెం, గుటాల అటవీ ప్రాంతంలో సింహభాగం చిత్రీకరించారు. అక్కడ ఏర్పాట్లు చేయటానికే రెండు నెలల సమయం పట్టింది. మద్రాసు నుంచి పనిముట్లను, పనివాళ్లను అక్కడకు రప్పించారు.అప్పట్లో ఏం కావాలన్నా బెజవాడ (విజయవాడ) పరిగెత్తాల్సి వచ్చేది. అలా రోజూ అక్కడ నుంచి బుట్టాయగూడేనికి కార్లు తిరుగుతూనే ఉండేవి. ఏ ఒక్క వస్తువు దొరక్కపోయినా, ఆ రోజు షూటింగ్ ఆగిపోవడమే. దాదాపు 7080 మంది కాలక్షేపం చేయాల్సి వచ్చేది. దీనికి పరిష్కారంగా.. అక్కడే కార్పెంటర్, టైలర్, ఇతర సెట్ డిజైనర్స్ తమకు కావాల్సిన వస్తువులు ముందే తీసుకుని, సిద్ధంగా ఉండేవారు.దాదాపు 70 రోజులు పాటు జరిగిన ఈ షూటింగ్‌లో 500 మంది యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. వీరంతా వారానికి 6 రోజులు నిరంతరం షూటింగ్‌లో పాల్గొని, ఆదివారం విశ్రాంతి తీసుకునే వారు.బుట్టాయగూడెం నుంచి అడవిలో షూటింగ్ జరిగే ప్రాంతం దాదాపు 15 మైళ్ల దూరం. సరిగ్గా రోడ్డు మార్గం కూడా ఉండేది కాదు.షూటింగ్ సమయంలో కృష్ణంరాజును తుర్రాజు అంటూ వాణిశ్రీ ఆటపట్టించేవారు.ఆరోజుల్లో పౌరాణిక సినిమాలకు 15 లక్షలకు మించి బడ్జెట్ ఉండేది కాదు. కానీ, ఈ చిత్రం కోసం కృష్ణంరాజు ఏకంగా రూ.20 లక్షలు ఖర్చు చేశారు.విడుదలైన అన్ని కేంద్రాల్లో 100 రోజుల పాటు విజయవంతంగా ప్రదర్శితమైంది.ఈ సినిమా ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో', యూట్యూబ్‌లో అందుబాటులో ఉంది.రాజ్‌కుమార్ నటించిన కన్నడ చిత్రం 'బెదర కన్నప్ప' (1954).. ఈ సినిమాకి స్ఫూర్తి. ఈతరం ప్రేక్షకులకు కన్నప్ప కథను మంచు విష్ణు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఆయన హీరోగా తెరకెక్కిన 'కన్నప్ప' గతేడాది విడుదలైంది.

కర్మ ఫలితంతో... 'మిస్టర్ మిడిల్‌క్లాస్'

''మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన సినిమా చేసి చాలా రోజులైంది. కాస్త విరామం తర్వాతైనా అలాంటి ఓ చక్కటి సినిమాని చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు ప్రముఖ కథానాయకుడు శ్రీకాంత్. ఆయన, లయ జంటగా జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ మిడిల్‌క్లాస్'.సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య పాత్ర పోషించారు. జీకే, సి.ఎన్ నిర్మాతలు. ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ వేడుక ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ దర్శకనిర్మాతలు ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకలో శ్రీకాంత్ మాట్లాడుతూ ''మంచి వినోదంతో రూపొందిన సినిమా ఇది. మొదట ఈ కథ గురించి విన్నా. ఆ తర్వాత దర్శకుడు నాగేశ్వర్‌రెడ్డి అని తెలిశాక మరింత నమ్మకం పెరిగింది. లయ, నేను కలిసి చాలా సినిమాలు చేశాం. ఆమె 'స్వరాభిషేకం' సమయంలో ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. సునీల్, వెన్నెల కిశోర్, రఘుబాబు, అలీ తదితరులంతా ఇందులో కీలక పాత్రల్ని పోషించారు. రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎన్నో సినిమాలు చేశా. ఆయన ఈ సినిమాలో వెంకటేశ్వర స్వామి పాత్రని ఎంతో నిష్ఠగా, అంకితభావంతో చేశార''న్నారు. లయ మాట్లాడుతూ ''దర్శకుడు నాగేశ్వర్‌రెడ్డి ఈ కథ చెబుతున్నప్పుడే నేను చాలా నవ్వుకున్నా. అందరినీ నవ్విస్తూనే కనెక్ట్ అయ్యే సినిమా ఇది. శ్రీకాంత్ కూడా ఇప్పటికీ అలాగే ఉన్నారు. ఈ సినిమా చేస్తున్నప్పుడు కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణం చేసినట్టే అనిపించింది'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''శ్రీకాంత్‌కు ఇదొక పునరాగమనం తరహా సినిమా అవుతుంది. అనుకున్న బడ్జెట్‌లో మంచి సినిమా తీయాలనేదే నా తపన. ఈ సినిమా ఇంత వేగంగా పూర్తి కావడానికి కారణం శ్రీకాంత్. కర్మ ఫలితం గురించి చెప్పాం. ప్రతి సన్నివేశాన్నీ నవ్వుతూ ఆస్వాదిస్తారు ప్రేక్షకులు'' అన్నారు. మంచి కలయికలో వస్తున్న సినిమా ఇదన్నారు ఎస్వీ కృష్ణారెడ్డి. ప్రతి భావోద్వేగాన్నీ అద్భుతంగా ఆవిష్కరించే దర్శకుడు నాగేశ్వర్‌రెడ్డి అనీ, ఈ సినిమాతోనూ తనకు మంచి విజయం దక్కుతుందన్నారు కె.అచ్చిరెడ్డి. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు సాయికార్తీక్, రచయిత డైమండ్ రత్నబాబు, నిర్మాత చందు తదితరులు పాల్గొన్నారు.

జానపద కథతో 'శక్తి శాలినీ'

'స్త్రీ', 'ముంజ్యా' లాంటి పలు విజయంతమైన చిత్రాలను నిర్మించిన మడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలినీ'. 'సైయారా' విజయంతో సినీప్రియుల్ని మురిపించిన కథానాయిక అనీత్ పడ్డా ఈ సినిమాలో ప్రధానపాత్రలో నటిస్తుంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినయంలో కనిపించనుందని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతుంది. తాజాగా ఈ సినిమా జానపద కథ నేపథ్యంలో రూపొందుతుందని తెలిసింది. ''బెంగాలీ పురాణాలలోని ఒక జానపద కథాంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా భారీ క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణను కూడా పూర్తి చేశారు. ఈ చిత్రం శక్తి, శాలినిల మధ్య రివెంజ్ డ్రామాగా రూపొందుతుంది. అనీత్ ఇందులో శక్తి అనే రక్షకురాలిగా, ప్రతీకారం తీర్చుకోవాలనే శాలినీ అనే ఆత్మగా ద్విపాత్రాభినయం చేస్తోంది. ఇందులో ఈ రెండు పాత్రల మధ్య జరిగే ఘర్షణ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద''ని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంతో పాటు మోహిత్ సూరి దర్శకత్వంలో అహాన్ పాండే సరసన ఓ చిత్రంలో నటిస్తోంది అనీత్.

టైటాన్స్ పంజా రాజస్థాన్‌పై విజయంతో ఫైనల్‌కు

ముల్లాన్‌పుర్: గుజరాత్ టైటాన్స్ అదరహో! నిజంగా అద్భుతమే ఇది. 2022లో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన గుజరాత్.. అత్యుత్తమ ఆటతో, ఆశ్చర్యపరిచే నిలకడతో అయిదు సీజన్లలోనే మూడోసారి ఫైనల్‌కు దూసుకెళ్లి ఔరా అనిపించింది. ఇప్పటికే ఓసారి విజేతగా నిలిచిన టైటాన్స్.. రెండో టైటిల్ కోసం ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది. క్వాలిఫయర్ 1లో ఎదురుపడ్డ జట్లే ట్రోఫీ కోసం తలపడబోతున్నాయన్నమాట. క్వాలిఫయర్ 2లో గుజరాత్ నిర్దాక్షిణ్య ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విధ్వంసక శతకం సాధించిన వేళ.. రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుగా ఓడించింది. 215 పరుగుల లక్ష్యాన్ని టైటాన్స్ అలవోకగా ఛేదించింది. ప్రతికూల పరిస్థితుల్లో రాజస్థాన్‌కు మెరుగైన స్కోరును అందించిన వైభవ్ సూర్యవంశీ శ్రమ వృథా అయింది. టైటిల్ సమరం ఆదివారం.

గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ 19 ఫైనల్లోకి ప్రవేశించింది. కెప్టెన్ గిల్ (104; 53 బంతుల్లో 15×4, 3×6) మెరుపు సెంచరీ కొట్టడంతో శుక్రవారం జరిగిన క్వాలిఫయర్ 2లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించింది. వైభవ్ సూర్యవంశీ (96; 47 బంతుల్లో 8×4, 7×6) చెలరేగడంతో మొదట రాజస్థాన్ 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. జడేజా (45 నాటౌట్; 35 బంతుల్లో 5×4, 1×6), డొనోవన్ ఫెరీరా (38 నాటౌట్; 11 బంతుల్లో 2×4, 4×6) రాణించారు. రబాడ (2/35), హోల్డర్ (2/27) రాయల్స్‌ను దెబ్బతీశారు. గిల్‌తో పాటు సాయి సుదర్శన్ (58; 32 బంతుల్లో 8×4, 1×6) మెరవడంతో లక్ష్యాన్ని గుజరాత్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

ఓపెనర్ల విధ్వంసం: ఛేదనలో గుజరాత్ అదరగొట్టింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు సాయి సుదర్శన్, గిల్ మరోసారి జట్టుకు శుభారంభాన్నిచ్చారు. ఎడాపెడా ఫోర్లు కొట్టేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఏ బౌలర్ కూడా బ్యాటర్లపై ప్రభావం చూపలేకపోయాడు. తుషార్, యశ్‌రాజ్ ఓవర్లలో సుదర్శన్ రెండేసి ఫోర్లు బాదగా.. తుషార్ ఓవర్లో గిల్ సిక్స్ రెండు ఫోర్లు దంచాడు. మ్యాచ్ సాగుతున్నకొద్దీ గిల్ విధ్వంసం తీవ్రమైంది. 30 బంతుల్లో అర్ధశతకం బాదిన గిల్.. జడేజా ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. 10 ఓవర్లు ముగిసే సరికి 127/0తో గుజరాత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. యశ్‌రాజ్ బౌలింగ్‌లో సిక్స్‌తో సుదర్శన్ 26 బంతుల్లో అర్ధశతకాన్నందుకున్నాడు. చిన్న అవకాశమైనా ఇవ్వకుండా బ్యాటర్లు విరుచుకుపడుతున్న తీరు రాజస్థాన్ బౌలర్లను నిరాశలోకి నెట్టింది. ఫోర్లు ప్రవాహంలా వస్తుండడంతో 12వ ఓవర్లోనే స్కోరు 150 దాటింది. అప్పటికే టైటాన్స్ విజయం దాదాపుగా ఖాయమైంది. ఆ దశలో సుదర్శన్.. గత మ్యాచ్‌లోలాగే హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. సెంచరీ పూర్తి చేశాక గిల్ కూడా ఔటయ్యాడు. అయితే పరుగుల వేగం తగ్గినా.. సుందర్ (16) కూడా ఔటైనా, టైటాన్స్‌కు ఇబ్బంది లేకపోయింది. చివరి రెండు ఓవర్లలో 10 పరుగులు అవసరం కాగా.. తెవాతియా (17 నాటౌట్), బట్లర్ (9 నాటౌట్) పని పూర్తి చేశారు.

మెరిసిన వైభవ్: రాజస్థాన్ 214 పరుగులు చేయడం ఊహించనిదే. తడబాటుతో మొదలెట్టిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను ముగించిన తీరు అద్భుతం. వైభవ్ ఎప్పటిలా భీకరంగా విరుచుకుపడకపోయినా.. అవసరమైతే తాను ఓపికగా నిలబడగలనని నిరూపించుకుంటూ బ్యాట్ ఝుళిపించాడు. 70/2. పవర్‌ప్లే ముగిసే సరికి రాజస్థాన్ స్కోరిది. చిచ్చరపిడుగు వైభవ్ ఇంకా క్రీజులో ఉండగా.. ఈ స్కోరు తక్కువగానే కనిపించవచ్చు. ఇన్నింగ్స్ మొదలైన తీరు చూస్తే మాత్రం 6 ఓవర్లకు రాయల్స్ స్థితి బాగానే ఉన్నట్లు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్‌కు ఆరంభమే షాక్. తొలి ఓవర్లోనే జైస్వాల్ (1)ను సిరాజ్ ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జురెల్ (7)ను రబాడ వెనక్కి పంపాడు. 9కే రెండు వికెట్లు పోవడం వల్లనేమో వైభవ్ ఆరంభంలో సాధికారికంగా ఆడలేకపోయాడు. అయితే తన ప్రమాణాల ప్రకారం వైభవ్ ధాటిగా ఆడినట్లు అనిపించకపోవచ్చు కానీ.. అతడి ఇన్నింగ్స్ దూకుడుగానే సాగింది. సిరాజ్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన వైభవ్.. రబాడ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ దంచేశాడు. మరోవైపు జడేజా ధాటిగా ఆడాడు. అయితే పవర్‌ప్లే తర్వాత స్కోరు వేగం తగ్గింది. వైభవ్ సహనం వహిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు బంతిని బౌండరీ దాటించాడు. కానీ జడేజా రిటైర్డ్ హర్ట్ కావడం రాజస్థాన్‌కు ప్రతికూలంగా మారింది. కెప్టెన్ పరాగ్ (11).. ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. 7 నుంచి 10 ఓవర్ల మధ్య నాలుగు ఓవర్లలో రాయల్స్‌కు 33 పరుగులు మాత్రమే వచ్చాయి. శానక (3), ఆర్చర్ (7) కూడా వెంటనే వెనుదిరగడంతో 13వ ఓవర్లో 118/5తో నిలిచిన రాజస్థాన్.. తక్కువ స్కోరుకే సరిపెట్టుకుందేమో అనిపించింది. కానీ ప్రతికూల పరిస్థితుల్లో వైభవ్ దూకుడు పెంచాడు. చకచకా సిక్స్‌లు బాదిన అతడు.. బ్యాటింగ్‌కు తిరిగొచ్చిన జడేజాతో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. శతకం పూర్తి చేసేలా కనిపించాడు. కానీ వరుసగా రెండో మ్యాచ్‌లో త్రుటిలో మూడంకెల స్కోరును చేజార్చుకున్నాడు. అయితే ఫెరీరా రాజస్థాన్ ఇన్నింగ్స్‌కు కళ్లు చెదిరే ముగింపునిచ్చాడు.

టాస్.. రెండుసార్లు

ముల్లాన్‌పుర్: ఐపీఎల్ 19 రెండో క్వాలిఫయర్ సందర్భంగా టాస్ విషయంలో చిన్న గందరగోళం తలెత్తింది. మొదట గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాణేన్ని పైకి వేయగా, రాజస్థాన్ రాయల్స్ సారథి రియాన్ పరాగ్ 'హెడ్స్' అన్నట్లుగా వినిపించింది. నాణెం 'టెయిల్స్' చూపించగా.. టాస్ వేసే అధికారి నాణేన్ని వెంటనే తన చేతికి తీసుకుని ఇద్దరు కెప్టెన్లతో ఏదో మాట్లాడాడు. పరాగ్ ఏదో చెబుతుంటే.. గిల్ అయోమయంగా ముఖం పెట్టాడు. తర్వాత కామెంటేటర్ రవిశాస్త్రి స్టేడియంలో శబ్దం వల్ల చిన్న గందరగోళం తలెత్తిందని, నాణేన్ని మళ్లీ వేస్తారని చెప్పాడు. గిల్ మళ్లీ నాణేన్ని పైకి వేయగా.. పరాగ్ కోరుకున్నట్లే 'హెడ్స్' పడడంతో అతను బ్యాటింగ్ ఎంచుకున్నాడు.

సుదర్శన్ మళ్లీ

పాపం సాయి సుదర్శన్! క్వాలిఫయర్ 1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తొలి క్వాలిఫయర్‌లో జాకబ్ డఫీ బౌలింగ్‌లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన అతడు.. రాజస్థాన్ రాయల్స్‌తో క్వాలిఫయర్ 2లోనూ అదే తరహాలో వికెట్ సమర్పించుకున్నాడు. బ్రిజేశ్ శర్మ వేసిన 13వ ఓవర్లో డ్రైవ్ ఆడిన సుదర్శన్ నియంత్రణ కోల్పోయి బ్యాట్‌ను వదిలేశాడు. గత మ్యాచ్‌లో బ్యాట్ నేల మీద పడి, తర్వాత స్టంప్‌స్‌ను తాకగా.. ఈసారి నేరుగా వికెట్ల మీదే పడింది. అతడు తీవ్ర నిర్వేదంలో క్రీజును వీడాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో హిట్ వికెట్ రూపంలో ఔట్ అయిన తొలి బ్యాటర్‌గా సుదర్శన్ కోరుకోని రికార్డును ఖాతాలో వేసుకున్నాడు.

స్కోరు వివరాలు

స్కోరు వివరాలు: రాజస్థాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ప్రసిద్ధ్ (బ) సిరాజ్ 1; వైభవ్ (సి) ప్రసిద్ధ్ (బ) రబాడ 96 ; జురెల్ (సి) గిల్ (బ) రబాడ 7; జడేజా నాటౌట్ 45; పరాగ్ (సి) రబాడ (బ) హోల్డర్ 11; శానక (సి) బట్లర్ (బ) హోల్డర్ 3; ఆర్చర్ (సి) బట్లర్ (బ) ప్రసిద్ధ్ 7; ఫెరీరా నాటౌట్ 38; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 214; వికెట్ల పతనం: 1-2, 2-9, 3-101, 4-109, 5-118, 6-172; బౌలింగ్: సిరాజ్ 4-0-42-1; రబాడ 4-0-35-2; ప్రసిద్ధ్ 4-0-42-1; సుందర్ 2-0-23-0; హోల్డర్ 4-0-27-2; రషీద్ ఖాన్ 2-0-45-0; గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ హిట్ వికెట్ (బ) బ్రిజేశ్ 58; గిల్ ఎల్బీ (బ) ఆర్చర్ 104; బట్లర్ నాటౌట్ 9; సుందర్ (సి) ఫెరీరా (బ) బర్గర్ 16; తెవాతియా నాటౌట్ 17; ఎక్స్‌ట్రాలు 15, మొత్తం: (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 219 వికెట్ల పతనం: 1-167, 2-182, 3-201; బౌలింగ్: ఆర్చర్ 4-0-45-1; బర్గర్ 4-0-35-1; బ్రిజేశ్ 3.4-0-44-1; తుషార్ 3-0-34-0; యశ్‌రాజ్ 2-0-29-0; జడేజా 2-0-28-0

సింధు, లక్ష్య ఔట్

సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడింటన్ టోర్నమెంట్లో స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్‌ల కథ ముగిసింది. ఇక ఆశలన్నీ సెమీస్ చేరిన సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జోడీ మీదే నిలిచాయి. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్‌స్‌లో సింధు 17-21, 14-21తో ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సియాంగ్ చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్‌లో సింధు 7-11తో వెనుకబడినా.. తర్వాత పుంజుకుని 13-14తో ఆన్ సియాంగ్‌ను సమీపించింది. కానీ మళ్లీ ఒత్తిడికి గురి కావడంతో 17-19తో వెనుకబడి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్ మొదట్లో ఆన్ సియాంగ్ ధాటికి సింధు నిలవలేకపోయింది. ఆరంభంలోనే 0-6తో వెనుకబడిన సింధు.. తర్వాత 12-14తో కాస్త కోలుకుంది. ఆ తర్వాత అనవసర తప్పిదాలకు చోటిచ్చిన భారత స్టార్.. 13-18తో వెనుకబడింది. ఆపై గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది. ఆన్ సియాంగ్‌పై ఆడిన 9 మ్యాచ్‌ల్లోనూ సింధు ఓడిపోవడం గమనార్హం. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌స్‌లో లక్ష్య 19-21, 21-15, 15-21తో వతనబె (జపాన్) చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 19-21, 21-17, 21-13తో కయ్ జింగ్-ఆరోన్ తాయ్ (మలేసియా) జంటపై గెలిచింది. సెమీస్‌లో టాప్ సీడ్ జంట వోన్-సెయుంగ్ (కొరియా)తో సాత్విక్ జోడీ అమీతుమీ తేల్చుకోనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ సెమీస్ చేరింది. వీరు క్వార్టర్‌స్‌లో 16-18తో వెనుకబడి ఉన్న దశలో ప్రత్యర్థి ద్వయం మ్యాచ్ నుంచి తప్పుకొంది.

వినేశ్‌కు సుప్రీం కోర్టు అనుమతి

దిల్లీ: సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీం కోర్టులోనూ ఊరట దక్కింది. దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. వినేశ్ శనివారం జరిగే ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సుప్రీం కోర్టు అనుమతిచ్చింది. అంతకుముందు దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు.. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారిణి అదితి చౌహాన్, భారత క్రీడా ప్రాధికార సంఘం (సాయ్) నుంచి హాకీ జట్టు మాజీ కెప్టెన్ ఎమ్ఎమ్. సోమయ్య ప్రభుత్వం తరఫున పరిశీలకులుగా ట్రయల్స్‌కు హాజరు కానున్నారు. వినేశ్ పోటీలను వీళ్లిద్దరూ వీక్షించనున్నారు.

50 కేజీల విభాగంలో..: అయితే వినేశ్ 50 కేజీల విభాగంలో మాత్రమే అనుమతించాలని డబ్ల్యూఎఫ్ఐ నిర్ణయించింది. ఆమె పోటీ పడాలనుకుంటున్న విభాగం గురించి తెలియజేయాలని అధికారులు అడగ్గా.. శుక్రవారం సాయంత్రం వరకు వినేశ్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సమాఖ్య చెప్పింది. ఆమె ఇదివరకు పోటీపడిన 50 కేజీల విభాగంలోనే ఇప్పుడు కూడా తలపడుతుందని సమాఖ్య పరిగణనలోకి తీసుకుంది.

కెప్టెన్సీకి పంత్ టాటా

దిల్లీ: వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. 2026 ఐపీఎల్‌లో ఎల్ఎస్‌జీ అత్యంత పేలవ ప్రదర్శన చేసిన నేపథ్యంలో పంత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ సీజన్‌లో లఖ్‌నవూ కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. పంత్ కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ ప్రభావం చూపలేకపోయాడు. అతను 14 ఇన్నింగ్స్‌ల్లో 28.36 సగటుతో 312 పరుగులు చేశాడు. స్ట్రైక్‌రేట్ 138.05 మాత్రమే. పంత్ సీజన్ మొత్తంలో ఒకే అర్ధశతకం సాధించాడు. "కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాలని రిషబ్ పంత్ విజ్ఞప్తి చేశాడు. అతడి విన్నపానికి ఫ్రాంఛైజీ వెంటనే అంగీకారం తెలిపింది" అని లఖ్‌నవూ ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది. "ఈ నిర్ణయం అంత తేలికైంది కాదు. కెప్టెన్‌గా పంత్ చేసిన సేవలకు మేం కృతజ్ఞులం. ఇప్పుడు మా దృష్టి సమష్టిగా జట్టును నిర్మించడంపైనే" అని లఖ్‌నవూ క్రికెట్ డైరెక్టర్ టామ్ మూడీ చెప్పాడు. 28 ఏళ్ల పంత్.. లఖ్‌నవూకు రెండో కెప్టెన్. 2022 నుంచి 2024 వరకు రాహుల్ ఆ జట్టుకు సారథిగా వ్యవహరించాడు. అతడి సారథ్యంలో తొలి రెండు సీజన్లు ప్లేఆఫ్స్ చేరిన ఎల్ఎస్‌జీ.. 2024లో ఏడో స్థానానికి పరిమితమైంది. తర్వాతి సీజన్‌కు అతను దిల్లీకి వెళ్లిపోయాడు. ఎల్ఎస్‌జీ 2025 మెగా వేలంలో పంత్‌ను రూ.27 కోట్లకు చేజిక్కించుకుంది. ఇప్పటికీ లీగ్‌లో ఇదే అత్యధిక ధర. అయితే ఎల్ఎస్‌జీ తరఫున పంత్ ఇన్నింగ్స్ సవ్యంగా సాగలేదు. అతడి నాయకత్వంలో లఖ్‌నవూ 18 మ్యాచ్‌ల్లో ఓడి, 10 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. 2025లో ఏడో స్థానంలో, 2026లో పదో స్థానంలో నిలిచింది. రెండు సీజన్లలోనూ పంత్ వ్యక్తిగత ప్రదర్శన పేలవమే. 2025లో అతడు 133.16 స్ట్రైక్‌రేట్‌తో 269 పరుగులు మాత్రమే సాధించాడు. లఖ్‌నవూ సారథిని మార్చబోతున్నట్లు టామ్ మూడీ ఇంతకుముందే సూచనప్రాయంగా చెప్పాడు. మిచెల్ మార్ష్, మార్‌క్రమ్, పూరన్.. లఖ్‌నవూ కెప్టెన్సీ రేసులో ఉన్నారు. తర్వాతి సీజన్‌కు ఆటగాడిగా కూడా పంత్ ఎల్ఎస్‌జీతో కొనసాగడం సందేహమే.

సూపర్ పూజ

హాంకాంగ్: ఆసియా అండర్20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ పూజ సింగ్ జాతీయ సీనియర్ రికార్డును బద్దలు కొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల లాంగ్‌జంప్‌లో పూజ 1.93 మీటర్ల జంప్‌తో స్వర్ణం సాధించింది. ఈ క్రమంలో ఆమె 2012లో సహన కుమారి నెలకొల్పిన రికార్డు (1.92 మీ)ను బద్దలు కొట్టింది. ఈ ప్రదర్శనతో పూజ.. కామన్వెల్త్ క్రీడల అర్హత ప్రమాణాన్ని (1.92 మీ) కూడా అందుకుంది. పురుషుల 5 వేల మీటర్ల పరుగులో నితిన్ గుప్తా పసిడి నెగ్గాడు. అతడు 19 నిమిషాల 47.49 సెకన్లలో అగ్రస్థానంలో నిలిచాడు. మహిళల డిస్కస్ త్రోలో అమానత్ కాంబోజ్ (52.24 మీ.) స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. పురుషుల డెకథ్లాన్‌లో రాహుల్ జాకర్ (7185 పాయింట్లు) పసిడి నెగ్గగా.. సాధన దేవి (మహిళల ట్రిపుల్ జంప్), ఉపకార్ (పురుషుల డెకథ్లాన్), నీరూ (మహిళల 400 మీటర్లు) రజతాలు గెలుచుకున్నారు.